## క్లుప్తంగా

### అర్హులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి

మిర్యాలగూడ అర్బన్ : అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో పశువుల తొట్లు నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సైదమ్మ, మల్లమ్మ, లింగయ్య, సైదులు, వెంకటమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదవశాత్తు బత్తాయి చెట్లు దగ్ధం



దగ్ధమైన బత్తాయి చెట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

పెద్దఅడిశర్లపల్లి : ప్రమాదవశాత్తు బత్తాయి చెట్లు దగ్ధమైన సంఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని నారాయణ శ్రీనివాస్, ఏరుకొండ లింగయ్య, ఘనపురం సంతోష్‌కుమార్‌లకు చెందిన బత్తాయి తోటలోని సుమారు 65బత్తాయి చెట్లు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. ఈ ఘటనా స్థలాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

### సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న పీడీలు

కొండమల్లేపల్లి : తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీల్లోని ఫిజికల్ డైరెక్టర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో తెలంగాణ పీఈటీ సంఘం రాష్ట్ర కార్యదర్శి పొన్నగాని కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. పీడీలుగా పనిచేస్తున్న వారి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. మంత్రిని కలిసి వారిలో చంద్రయ్య, కేతావత్ శ్రీను, సతీష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

### క్షుద్ర పూజలు చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు

అడవిదేవులపల్లి : మండలం మొల్కచర్ల గ్రామంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో మైసమ్మ గుడి వద్ద క్షుద్ర పూజలతో పాటు దున్నపోతును బలి చేశారంటూ మంగళవారం గ్రామానికి చెందిన ఆమటి గురువయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

### ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



హోలీ ఆడుతున్న మహిళా భక్తులు

హాలియా : పట్టణంలోని సాయిప్రతాప్‌నగర్ కాలనీలో కొలువై ఉన్న స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆలయ స్థానాచార్యులు గోవర్ధన రాఘవాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం మహా పూర్ణహుతి, చక్రస్నానం, మహాకుంభప్రోక్షణ తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళ భక్తులు వసంతోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆడిపాడారు. కార్యక్రమంలో భాగ్య, సరస్వతి, స్వాతి, అరుణ, వరలక్ష్మి, చంద్రకళ ఉన్నారు.

### ఆర్థికసాయం అందజేత

రామగిరి(నల్లగొండ): నల్గొండ పట్టణానికి చెందిన ఫోటోగ్రాఫర్ కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న దాసరి ప్రశాంత్ కు తెలంగాణ ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ప్రవేశపెట్టిన కుటుంబ భరోసా పథకం కింద రూ. 10,000 చెక్కును మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పసుపులేటి కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట మోహన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం కోశాధికారి భీమిడి మాధవరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంధం ఉపేంద్ర కుమార్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సామల వెంకటేశ్వర్లు, కుటుంబ భరోసా ఇంచార్జ్ నాగరాజు, రవి, జనార్దన్, కోట శ్రీనివాస్, దుగ్యాల గణేష్ పాల్గొన్నారు.

# ఇంకుడుగుంతలపై పట్టింపేది?

- నిర్మాణంపై ఆసక్తి చూపని ప్రజలు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- స్వచ్ఛందంగా ముందుకు రావాలంటున్న అధికారులు



పట్టణంలోని పెట్రోల్ బంక్‌లో ఇంకుడు గుంతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

దేవరకొండ : భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో ఇప్పటికే మరోమారు ఇంకుడు గుంతల నిర్మాణం తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా మున్సిపాలిటీల్లో జల సంరక్షణకు గతంలోనే మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వేసవిలో భూగర్భజలాలు అండుగంటే సమస్యను అధిగమించేందుకు ఇంకుడు గుంతలు నిర్మించేలా చొరవ తీసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంటి నిర్మాణ సమయంలో తప్పనిసరిగా ఇంకుడుగుంత నిర్మాణం చేపడతామని అనుమతి పొందుతున్న వారు వాటిని నిర్మించడంలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

**ఆసక్తి చూపని పట్టణ ప్రజలు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో 300గజాలకు పైగా స్థలం ఇళ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మించుకోవాలంటే సెట్ బ్యాక్‌తో పాటు ఇంకుడుగుంతల నిర్మాణం తప్పనిసరి. రోజు రోజుకి కాంక్రిట్ వినియోగం పెరిగిపోయి నీటి సంరక్షణకు చర్యలు లేకపోవడంతో కొత్తగా ఇళ్లు నిర్మించే వారు ఇంకుడుగుంత నిర్మించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసే సమయంలో ఇంకుడుగుంత నిర్మాణం కోసం ఒక్కో స్క్వేర్ మీటర్‌కు రూ.15చొప్పున వసూలు చేస్తారు. ఇంకుడుగుంతను నిర్మించుకున్నట్లుగా నిర్మాణదారులు ఆధారాలు చూపితే తిరిగి సొమ్మును వారికి చెల్లించాలనేది ప్రభుత్వ నిబంధన. ప్రతి నెలా పదుల సంఖ్యలో పట్టణంలో నిర్మాణాలు జరుగుతున్నా ఇంకుడుగుంతలు నిర్మిస్తున్న వారు తక్కువే.

**దేవరకొండలో 25 మాత్రమే**

ఇంకుడుగుంతల ప్రాధాన్యత గుర్తించిన ప్రభుత్వం ఇప్పటికే మున్సిపాల్టీలో వాటి నిర్మాణాలు, ఉపయోగాలు వంటి పరిస్థితిపై గతేడాది సర్వే చేయించింది. దీంతో అప్పుడు మున్సిపల్ అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగి పట్టణంలో 300గజాలకు పైగా నిర్మించిన ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో సర్వే నిర్వహించి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టని యజమానులకు నోటీసులు సైతం జారీ చేశారు. దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 7వేల 224 అసెస్‌మెంట్లు ఉండగా అందులో 300గజాలకు పైగా ఉన్న వందనిర్మాణాలను అధికారులు గుర్తించారు. కాగా వీటిలో కేవలం 25నిర్మాణాల్లో మాత్రమే ఇంకుడుగుంతల నిర్మాణాలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ లెక్కన పట్టణ ప్రజలు ఇంకుడుగుంతలకు ఏ మేరకు ప్రాధాన్యతనిస్తున్నారనేది స్పష్టం అవుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఇంకుడుగుంతల ప్రాధాన్యతపై పట్టణ ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

**స్వచ్ఛందంగా ముందుకు రావాలి**



ఇంకుడు గుంతల నిర్మాణాలు వాటి నిర్మాణం వల్ల ఉపయోగాలపై ఇప్పటికే పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాం. కొత్తగా నిర్మాణం చేపట్టే యజమానులు తప్పనిసరిగా ఇంకుడుగుంతను నిర్మించుకోవాలి. ఇంకుడు గుంతలు నిర్మించుకున్నట్లయితే నీటి వృథాను అరికట్టవచ్చు. నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భజలాలను పెంపొందించుకోవచ్చు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

– వై. సుదర్శన్, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ

## సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ నివాసంలో నిర్వహించిన సమావేశంలో పీసీసీ జిల్లా సమన్వయకర్త ఎండీ నాసేర్, పార్లమెంట్ కో–ఆర్డినేటర్ ఎంఏ సిరాజ్‌ఖాన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్, వివిధ మండలాల అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, బోద్యానాయక్, ఎల్లయ్యయాదవ్, వేమన్‌రెడ్డి, నాగభూషణం, రాజేష్‌రెడ్డి, రాంసింగ్ ఉన్నారు.

## సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ : భారత సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని బీడీఎస్ కార్యాలయంలో ఇటీవల జరిగిన యుద్ధంలో అసువులు బాసిన వీర జవాన్ మురళినాయక్ మృతికి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్–పాకిస్తాన్ యుద్ధ సమయంలో జరిగిన కాల్పుల్లో దేశం కోసం తన ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాడి వీర మరణం పొంది ఎంతో మందికి ఆదర్శప్రాయుడయ్యాడని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీను, రంజాన్‌బేగ్, భాషానాయక్, లక్ష్మణ్, మోహన్, టీక్యానాయక్, గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రిలో ఊయల కార్యక్రమం



ఊయల కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ మమత, తదితరులు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో సీడీపీఓ మమత ఆధ్వర్యంలో ఊయల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెంచలేని స్థితి అనిపించిన శిశువులను, అనారోగ్యంతో, అవవాల లోపంతో జన్మించిన శిశువులను సమాజానికి భయపడి ఎక్కడో చెత్త కుప్పలలో, కాలువల్లో పడేస్తూ శిశు మరణాలకు కారణమవుతున్నారని అలాంటి వారి కోసం ఈ ఉయ్యాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పెంచలేని, ఏదైనా లోపాలతో జన్మించిన శిశువులను పడేయకుండా ఉయ్యాలలో వేస్తే శిశువుల ఆలనా, పాలనా చూసుకునేందుకు జిల్లా పరిధిలోని శిశు గృహాలకు పంపించి ఎవరైనా దత్తత తీసుకోవాలనుకునే తల్లిదండ్రులకు లీగల్‌గా చట్టపరమైన దత్తత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరథ్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ చైర్మన్ చింత కృష్ణయ్య, లీగల్ అడ్వయిజర్ వెంకన్న, సోషల్ వర్కర్ రమణి, శిశు గృహ మేనేజర్ దుర్గా, ఐసీడిఎస్ సూపర్ వైజర్స్ లీలాకుమారి, నాగమణి, నజీమబేగం, మహ్మద్, పద్మ పాల్గొన్నారు.

## రెవెన్యూ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి



టీజీఆర్ఎస్ శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ : తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన తండా గ్రామపంచాయతీలకు రెవెన్యూ గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో టీఆర్‌జీఎస్ రాష్ట్ర శిక్షణ తరగతుల కరపత్రాలను ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పేద దళిత గిరిజన పిల్లలకు 25శాతం సీట్లను ఉచితంగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులకు రిజర్వేషన్ ఉన్నప్పటికీ విద్యా, ఉద్యోగ, వ్యాపారరంగాల్లో ఇప్పటికీ వెనుకబడి ఉన్నారని, సబ్ ప్లాన్ నిధులను వారికే ఖర్చు చేయాలన్నారు. హాలియా పట్టణంలో నిర్వహించే టీజీఆర్‌ఎస్ రాష్ట్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర శంకర్‌నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రమావత్ నరేష్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత్ అశోక్‌నాయక్, నాయకులు రమావత్ రమేష్‌నాయక్, ప్రదీప్‌నాయక్, మణి నాయక్, దేవేందర్‌నాయక్ పాల్గొన్నారు.

# ధాన్యం దిగుమతుల్లో తాత్సారం చేయకూడదు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



కొండమల్లేపల్లి : రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్, ఎమ్మెల్యే



దేవరకొండ : మిల్లర్లతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : ధాన్యం దిగుమతుల్లో రైస్ మిల్లర్లు తాత్సారం చేయకూడదని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వచ్చే ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసుకొని లారీల కొరత లేకుండా చూడాలని ఆమె సూచించారు. రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు అనంతరం మిల్లుల వద్ద లారీల నుంచి ధాన్యం అన్‌లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అనంతరం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ దేవరకొండ ప్రాంతంలో పండిన ప్రతి ధాన్యపు గింజనూ ఇక్కడి మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించి వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారులు ధాన్యం దిగుమతి నేపథ్యంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఇన్‌చార్జ్ రెవెన్యూ కలెక్టర్ నారాయణ్ అమిత్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీశ్, డీసీఓ పత్యానాయక్, ఆర్డీఓ రమణారెడ్డి, సివిల్ సప్లయ్ డీటీ హన్మంతు శ్రీనివాస్‌గౌడ్, రైస్ మిల్లర్లున్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన**

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని చిన్న అడిశర్లపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న సమస్యలపై రైతులను అడిగి ఆమె తెలుసుకున్నారు. లారీల కొరత ఎక్కువగా ఉండడం వల్ల ధాన్యం కేంద్రాల్లోనే ఉండిపోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. సమస్య తెలుసుకున్న ఆమె వెంటనే లారీల యాజమనులతో తక్షణమే మాట్లాడి రోజుకు ఐదారు లారీలను పంపించే విధంగా, మిల్లు యాజమాన్యంతో మాట్లాడి కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వచ్చిన ధాన్యం వేగంగా అన్‌లోడ్ చేయించాలని మిల్లు యాజమాన్యానికి సూచించారు. మ్యాచర్ వచ్చిన వడ్లను వెంటనే సదరు మిల్లులకు పంపించాలని కేంద్రం నిర్వాహకులైన సీఈఓ తిరుపతిరెడ్డికి సూచించారు. కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వారిలో ఇన్‌చార్జ్ రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, డీసీఓ పత్యానాయక్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ నరేందర్, డీటీసీఎస్ఓ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి తదితరులున్నారు.

**రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి**

డిండి : కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధితాధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చెర్కుపల్లి, కామేపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వరిధాన్యం ఎత్తడానికి లారీల కొరత ఉన్నట్‌లెతై మండలంలోని చెర్కుపల్లి మిల్లుకు ట్రాక్టర్‌ల ద్వారా ధాన్యాన్ని తరలించాలని, డిండి–దేవరకొండ రోడ్డు మార్గంలో వెళ్తున్న ఖాళీ లారీలను నిలిపి యాజమానితో మాట్లాడి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలను తరలించాలని స్థానిక తహసీల్దార్ ఆంజనేయులకు ఆమె సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో మేన్‌టేనేన్స్ చేస్తున్న రికార్డుల్లో ధాన్యం నిలువ, లారీలకు ఎత్తిన ధాన్యం, రైతులకు డబ్బులు జమ అయిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని సీఈఓలకు కలెక్టర్ సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ, డీసీఎస్ఓ వెంకటేష్, ఆర్డీఓ రమణారెడ్డి, డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ ఆంజనేయులు, సీఈఓలు బాల్‌రెడ్డి, అంతిరెడ్డి, ఏఈఓలు తదితరులున్నారు.

## అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

పెద్దఅడిశర్లపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని పౌరసరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ హెచ్చరించారు. మంగళవారం గుడిపల్లి మండలం ఘనపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమశాతంతో సంబంధం లేకుండా మిల్లులకు ధాన్యం తరలిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని ఆక్షేపించారు. అనంతరం చెన్నకేశవ రైస్ మిల్లును తనిఖీ చేశారు. త్వరితగతిన ధాన్యం దిగుమతి చేసుకోవాలన్నారు.

## నిరుపయోగంగా చేతి పంపు



అడవిదేవులపల్లిలోని చౌడమ్మ గుడి వద్ద నిరుపయోగంగా ఉన్న చేతి పంపు

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని చౌడమ్మ గుడి వద్ద చేతి పంపు నిరుపయోగంగా ఉంది. రెండేళ్ల క్రితం చెడిపోయిన చేతి పంపు నాటి నుంచి నేటి వరకు మరమ్మతులకు నోచుకోకుండా నిరుపయోగంగా ఉంది. ఈ చేతి పంపు ద్వారా ఈ ప్రాంతంలో 20 గృహాలతో పాటు దేవాలయానికి వచ్చే భక్తులకు, దేవాలయం ముందు నుంచి పంట పొలాలకు వెళ్లే రైతులకు దాహార్తిని తీర్చుతుంది. తక్షణమే మరమ్మతులు చేసి ఈ చేతి పంపును వినియోగంలోకి తీసుకరావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## భవిత వనరుల కేంద్రం పరిశీలన



భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ పరికరాలు పరిశీలిస్తున్న కలెక్టర్

గుర్రంపోడు : మండలకేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల భవిత వనరుల కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. కేంద్రంలోని వసతులు, ఫిజియోథెరపీ పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. భవిత కేంద్రం ముందు శిథిలమైన ఏఎమ్మార్పీ క్వార్టర్లను, చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించాలన్నారు. మరుగుదొడ్లను పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రానికి అన్ని సౌకర్యాలు కల్పించి సక్రమంగా నడిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం భవిత కేంద్రంలో సంఘమిత్ర కార్యాలయం ఉండటంపై విద్యార్థులు ముఖ్యం కదా అని ప్రశ్నించారు. ఎమ్మార్సీలో నడుస్తున్న భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ పరికరాలను పరిశీలించి వినియోగాన్ని కేంద్ర నిర్వాహకురాలు ఐఈఆర్పీ శారదను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అడిషన్ కలెక్టర్ అమిత్ నారాయణ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ మంజుల, ఎంఈఓ యాదగిరి తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి



హాలియా : మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు



నిడమనూరు : వానాకాలం సాగుపై అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాస్త్రవేతలు, అధికారులు

హాలియా : రైతులు వానాకాలం సాగుకు సంబంధించి నాణ్యమైన విత్తనాలు, ఎరువుల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అనుముల మండలంలోని పాలెం గ్రామంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సస్యరక్షణలో రసాయన, పురుగుల మందులను అవసరం మేరకే వాడాలన్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. విత్తనాలు, పురుగు మందుల రశీదులు పంట పూర్తియ్యేలా భద్రం చేయాలని సూచించారు. హాలియా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కె చంద్రశేఖర్ మాట్లాడుతూ సస్యరక్షణలో చర్యల్లో రైతులు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ సాగులో పాటించాల్సిన ఆధునిక పద్ధతులను రైతులకు వివరించారు. సేంద్రియ వ్యవసాయం, సాగునీటి ఎరువుల యాజమాన్యం, పంట మార్పిడి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ సరిత, ఉద్యానవన శాఖ అధికారి మురళి, పాలెం గ్రామ అభ్యుదయ రైతులు కాట్నం రామయ్య, సైదయ్య, శ్రీను, రమేష్ తదితరులు ఉన్నారు.

**సాగు లాభదాయకంగా మారాలి**

నిడమనూరు : సాగు లాభదాయకంగా మార్చుకోవాలని కంపాసాగర్ వరి పరిశోధన క్షేత్రం సీనియర్ శాస్త్రవేత్త ఎస్ లింగయ్య సూచించారు. మండలంలోని తుమ్మడం గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కంపసాగర్ వరి పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్త లింగయ్య మాట్లాడుతూ సాగు వ్యయాన్ని తగ్గించుకొని అధిక దిగుబడితో సాగును లాభదాయకంగా మార్చుకోవాలన్నారు. సాగులో నీటి పొదుపు, పంట మార్పిడి వంటి అంశాలను వ్యవసాయాధికారులు వివరించారు. వానకాలం పంటల సాగు, అందుబాటులో ఉన్న విత్తన రకాలకు సంబంధించిన పోస్టర్లు అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ అధికారి టి రాంబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి ఎం అనిల్ నాయక్, పంచాయతీ కార్యదర్శి లింగయ్య, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నిడమనూరు : కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలపై ఈ నెల 20న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, సీఐటీయూ నాయకుడు బొడ్డు లింగయ్య పిలుపునిచ్చారు. అనంతరం సమ్మె పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక హక్కుల కోసం ఈనెల 20న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేసేలా ప్రతి కార్మికుడు సమ్మెలో పాల్గొనాలని కోరారు. సీఐటీయూ మండల కన్వీనర్ గురువయ్య, వెంకటయ్య, సైదులు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

**సమ్మె పోస్టర్ ఆవిష్కరణ**

మిర్యాలగూడ అర్బన్ : ఈ నెల 20న చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అన్నారు. మంగళవారం సమ్మె పోస్టర్‌ను కార్మిక నాయకులతో కలిసి ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తిరుపతి రామ్మూర్తి, మల్లు గౌతంరెడ్డి, బీఎం.నాయుడు, అంజల్‌రావు, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, రామ్‌నాయక్, అంజయ్య, వజ్రం, కృష్ణ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

## జూనియర్ కళాశాల ఏర్పాటు కలేనా!

- కొండమల్లేపల్లిలో ప్రభుత్వ కళాశాల లేక విద్యార్థులకు ఇబ్బందులు
- ఎన్నికల హామీలకే పరిమితం
- కళాశాల ఏర్పాటుతో పేద విద్యార్థులకు మేలు



కొండమల్లేపల్లి చౌరస్తా

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలం ఏర్పడి సుమారు తొమ్మిదేళ్లు గడుస్తున్నప్పటికీ పట్టణ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు మాజీ ఎమ్మెల్యే దృష్టికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని తీసుకెళ్లినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా కళాశాల ఏర్పాటు చేస్తే మండల పరిధిలోని చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**అందని ద్రాక్షగానే ఇంటర్ విద్య**

కొండమల్లేపల్లి మండలం నాలుగు రోడ్ల కూడలిగా ఉండడంతో చుట్టుపక్కల మండలాలకు అందుబాటులో ఉండడం కూడా విద్యాభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కొండమల్లేపల్లి పట్టణానికి చుట్టుపక్కల మండలాల నుంచి కూడా పాఠశాల విద్య కోసం పేద విద్యార్థులు వస్తుంటారు. ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో కొంత మంది పేద విద్యార్థులు దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మరికొంత మంది నల్లగొండ హైదరాబాద్ హాలియా వంటి పట్టణాలకు వెళ్తుంటారు. ఆర్థికంగా ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులు మాత్రమే ఇంటర్ విద్యను ప్రైవేట్ కళాశాలలో కొనసాగిస్తున్నారు. పేద విద్యార్థులకు మాత్రం పట్టణ పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో ఇంటర్ విద్య అందని ద్రాక్షగా మిగిలిపోయింది. కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యా సంఘాలు పై అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు మాత్రం కలగానే మిగిలిపోయింది. ఇప్పటికైన అధికారులు స్పందించి నాలుగు రోడ్ల కూడలి అయిన కొండమల్లేపల్లి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటును వేగవంతం చేయాలని విద్యార్థి సంఘాలతో పాటు పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలి**

కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు అత్యంత ఆవశ్యకం, పదో తరగతి విద్య పూర్తయిన తర్వాత ఇంటర్ విద్య కోసం పట్టణాలకు వెళ్లాలంటే చాలా ఖర్చుతో ఉంటుంది. పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఖర్చు భరించే స్థితిలో లేనందున కొండమల్లేపల్లి పట్టణంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు ఎంతో మేలు చేసిన వారవుతారు.

– దాసరి సురేష్, కొండమల్లేపల్లి, విద్యార్థిని తండ్రి